ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | సోమవారం | 13.07.2026 | సంపుటి : 2 | సంచిక : 12 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## విమర్శకులకు ప్రకాశ్ రాజ్ ఘాటు కౌంటర్

సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసిన ప్రముఖ నటుడు

"అన్నీ గమనిస్తున్నా" అంటూ స్పందన

విమర్శలకు వ్యంగ్యంగా బదులిచ్చిన ప్రకాశ్ రాజ్

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో

02



## పైసా కొట్టు.. డైలాగ్ పట్టు

ప్రకాశ్ రాజ్‌కు బండ్ల గణేశ్ కౌంటర్

ప్రకాశ్ రాజ్ వీడియోకు సోషల్ మీడియాలో ఘాటు స్పందన

ప్రజల మనసు గెలవాలంటే నిజాయతీ అవసరమని వ్యాఖ్య

సినిమా డైలాగుల్లా మాట్లాడొద్దంటూ చురక

నెట్టింట వైరల్‌గా మారిన ఇద్దరి పోస్టులు

02





## విజయవాడ ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం

7 ప్రైవేట్ బస్సుల దగ్ధం

02


# జాడలేని వాన

## మండిపోతున్న భానుడు

ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం డీలా!

రాష్ట్రంలో వరి సాగు సగం తగ్గే అవకాశం

సాధారణంగా జూలై నెలలో కనువిందు చేయాల్సిన రుతుపవన వర్షాలు కనుమరుగయ్యాయి. రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆకాశం నుంచి చినుకులు కురుస్తాయనుకుంటే.. దానికి భిన్నంగా భానుడు ప్రతాపం చూపుతున్నాడు. గడచిన రెండు రోజుల్లో నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరిగాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ ప్రభావం కనిపిస్తోంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజా నివేదికల ప్రకారం.. రాబోయే మరో మూడు రోజుల పాటు పొడి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉంది.



హైదరాబాద్, జూలై 12 : ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వరి సాగు దాదాపు సగం తగ్గే అవకాశం ఉందని వ్యవసాయశాఖ వెల్లడించింది. గత ఏడాది వానాకాలం సీజన్‌లో 70 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈసారి అది 30 నుంచి 40 లక్షల ఎకరాలకే పరిమితం కానుందని తెలిపింది. వరితోపాటు అధిక నీటి వినియోగ పంటల స్థానంలో 50 లక్షల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు పండించాలని పేర్కొంది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. 'రాష్ట్రంలో పంటలు వేయడానికి అనువైన కాలం ముగుస్తోంది. వెంటనే 50 లక్షల ఎకరాల్లో పప్పు, చిరుధాన్యాలు, నూనెగింజలు, వేరుసెనగ, పెసలు, కందులు, సజ్జలు వంటి ఆరు

-మిగతా 2 లో..



## నీళ్లు అడిగితే రక్తం కావాలా?

నన్ను జైల్లో వేసినా సరే.. నా ప్రాణం పోయినా సరే.. మోటార్లు ఆన్ చేసి రైతులను కాపాడండి

పంతాలకు పోయి.. పంటలను ఎండబెట్టొద్దు


మేడిగడ్డ వద్ద గేట్లు మూయకుండానే నీళ్లు ఎత్తిపోయొచ్చు

ఈ మాత్రం అవగాహన ముఖ్యమంత్రిలో లేకపోవడం శోచనీయం

బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

హైదరాబాద్: రైతులు సాగునీరు అడిగితే రక్తం కావాలంటూ మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన నరహంతకుడికి పెద్దగా తేడా కనిపించడం లేదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రతిపక్షాల రక్తాన్ని పంటలపై చల్లాలని, బెల్టుతో కొట్టాలని ఒక ముఖ్యమంత్రి మాట్లాడటం అత్యంత జుగుప్సాకరమని మండిపడ్డారు. హిట్లర్‌ను ఆదర్శంగా చెప్పుకునే రేవంత్ అదే తరహా హంతక భాష మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతుల పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం ఈగోతో కన్నెపల్లి, దేవాదుల మోటార్లను నిలిపివేసి రాష్ట్రాన్ని కరువు వైపు నెడుతోందన్నారు. తనను జైల్లో వేసినా, తన ప్రాణం పోయినా అభ్యంతరం లేదని, కానీ వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులను ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి

-మిగతా 2 లో..



## ఆలమట్టి గరిష్ఠ స్థాయికి కృష్ణమ్మ

నేడో రేపో దిగువకు కృష్ణమ్మ వరద

మేడిగడ్డ వద్ద తగ్గిన ప్రాణహిత ప్రవాహం

హైదరాబాద్, జూలై 12 : ఎగువ కృష్ణా ప్రధాన ప్రాజెక్టు ఆలమట్టి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. ఈ జలాశయం నిర్వహణ ప్రమాణాల ప్రకారం నిల్వ 100 టీఎంసీలకు చేరువయ్యే పరిస్థితి ఉంటే దిగువకు నీటిని విడుదల చేస్తారు. ఆదివారం నాటికి ఈ జలాశయ నీటిమట్టం 86 టీఎంసీలకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 129.72

-మిగతా 2 లో..

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుతో రైతులు బలవుతున్నారు

కేంద్ర మంత్రి బండి సంజయ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాటకాలు ఆడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. "భారాస కాళేశ్వరాన్ని సరిగా నిర్మించకుండా రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసింది. ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ సర్కారు ఈ ప్రాజెక్టును కోమాలోకి నెట్టింది. ఈ రెండు పార్టీల తీరుతో తెలంగాణ రైతులు బలవుతున్నారు.

హైదరాబాద్, జూలై 12 : డ్యామ్ సేఫ్టీ యాక్ట్ -2021 ప్రకారం.. బ్యారేజీల యజమాని తెలంగాణ ప్రభుత్వమే. ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ కమిటీలు సలహాలు మాత్రమే ఇస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోండి. బ్యారేజీ మరమ్మతు పనులు చేయాల్సింది కాంగ్రెస్ సర్కారే. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇప్పటికే మూడు సార్లు నివేదిక ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని పదేపదే చెప్పినా ఎందుకు పెడచెవిన పెడుతున్నారు? కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, బాధ్యులను జైల్లో వేస్తామని గతంలో ప్రకటించింది కాంగ్రెస్సే. అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరపకుండా.. రూ.9 వేల కోట్ల అవినీతిపై విచారణకే పరిమితమైంది" అని బండి సంజయ్ విమర్శించారు.





## నేడు ఎంపీలతో సీఎం రేవంత్ భేటీ

పార్లమెంటు వర్షాకాల భేటీ నేపథ్యంలో రాష్ట్ర ప్రాధాన్యతల గురించి వివరించనున్న ప్రభుత్వం

మధ్యాహ్నం 3 గంటలకు అన్ని పార్టీల ఎంపీలతో భేటీ.. ఆపై కాంగ్రెస్ ఎంపీలతో డిన్నర్

02



## హర్మూజ్‌లో హైటెన్షన్

ఖతార్ కీలక నిర్ణయం

దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కీలకమైన హర్మూజ్ జలసంధిని మరోసారి మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించడం, నౌకలపై దాడులు చేస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో గల్ఫ్ దేశం ఖతార్ కీలక నిర్ణయం తీసుకుంది. సముద్ర కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని వాణిజ్య నౌకల యాజమాన్యాలను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వాణిజ్య, విహార నౌకలతోపాటు, చేపల బోట్లను కూడా నిలిపివేయాలని స్పష్టం చేసింది. ప్రజా భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

దోహా : ఖతార్ రాజధాని దోహాపై ఇవాళ ఉదయం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వాటిలో కొన్నింటిని ఖతార్ రక్షణ వ్యవస్థ కూల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో కొందరు పౌరులకు తీవ్ర గాయాలైనట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమర్థంగా తిప్పికొట్టేందుకు తమ సేనలు పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు ఖతార్ ప్రభుత్వం తెలిపింది. ఇరాన్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఒమన్ మండిపడింది. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట తమ భూభాగంపై బాంబులు ప్రయోగించడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు ఒమన్‌లోని ఇరాన్ రాయబారికి సోషల్ మీడియా వేదికగా నిరసన తెలిపింది. "ఇరాన్ బాధ్యతారాహిత్యమైన చర్యలపై ఒమన్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది.

# జాడలేని వాన

(మొదటిపేజీ తరువాయి)

తడి పంటలు వేయాలి. ఈ నెల 15, 30, ఆగస్టు 15 తేదీలను ఆధారంగా చేసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త అత్యవసర ప్రత్యామ్నాయ (కంటింజెన్సీ) ప్రణాళిక అమలు చేయాలి. అయితే కనీసం 50 మిల్లీమీటర్ల వర్షపాతం వరుసగా రెండు నుంచి మూడు రోజులపాటు నమోదై, భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే రైతులు విత్తనాలు నాటాలి' అని నివేదికలో పేర్కొన్నారు. నివేదికపై ఆదివారం తన నివాసంలో సమీక్షించిన వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్)లో అత్యవసర సమావేశం ఏర్పాటుకు ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య శాఖల ఉన్నతాధికారులు, ఆయా వర్సిటీల శాస్త్రవేత్తలు, భారత నూనెగింజలు, చిరుధాన్యాల పరిశోధన సంస్థలు, వాతావరణ, భూగర్భ జల విభాగం అధికారులు పాల్గొనాలని సమాచారం పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం. సీఎం ఆదేశాల మేరకు అగ్రి, ఉద్యాన వర్సిటీలు, వాతావరణశాఖ, జిల్లా కలెక్టర్ల సమన్వయంతో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే సమగ్ర ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. దీని అమలుకు సోమవారం దిశానిర్దేశం చేస్తాం. మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేస్తున్నాం. జిల్లా, మండల స్థాయిలో ఎరువులు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లను తగినంతగా నిల్వ చేశాం. రైతు వేదికలు, వాట్సప్ గ్రూపులు, డిజిటల్ ప్లాట్‌ఫాంలు, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా రైతులకు నిరంతరం సాంకేతిక సూచనలు అందిస్తాం" అని తెలిపారు.





## నీళ్లు అడిగితే రక్తం కావాలా?

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిలో ప్రస్తుతం లక్ష క్యూసెక్కులకు పైగా వరద ప్రవహిస్తున్నా ప్రభుత్వం కావాలనే నీటిని ఎత్తడం లేదని హరీశ్ ఆరోపించారు. మేడిగడ్డ గేట్లు మూయకుండానే కన్నెపల్లి మోటార్లు నడపొచ్చని, ఇదే విషయాన్ని నిపుణులు, రిటైర్డ్ ఇంజనీర్లు, ఇరిగేషన్ అధికారులు కూడా ప్రభుత్వానికి స్పష్టం చేశారని తెలిపారు. కేవలం రూ.8.5 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీటిని ఎల్లంపల్లికి తరలించొచ్చని అధికారులు సూచించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారం బయటపడుతుందనే భయంతోనే మోటార్లు ఆన్ చేయడం లేదని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు నీటిని ఎత్తకపోతే ఎన్టీపీసీ, సింగరేణి, హైదరాబాద్ తాగునీటి అవసరాలు దెబ్బతినడంతోపాటు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మేడిగడ్డపై నివేదిక ఇచ్చిన ఎన్డీఎస్ఏ అధికారులే పోలవరం ప్రాజెక్టులో రూ.వేల కోట్ల నష్టానికి బాధ్యులని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలోనే వ్యవసాయ విప్లవం కాంగ్రెస్ పాలనలో 6.64 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందగా, బీఆర్ఎస్ హయాంలో 48.74 లక్షల ఎకరాలకు నీరందించామని హరీశ్ పేర్కొన్నారు. దేవాదులలో పూర్తిస్థాయిలో మోటార్లు నడపకుండా, గోదావరి జలాలను కిందకు వదిలి పట్టిసీమకు మేలు చేస్తూ సీఎం తన రాజకీయ గురువు చంద్రబాబుకు గురుదక్షిణ ఇస్తున్నారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ కక్షలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని, వెంటనే కన్నెపల్లి, దేవాదుల మోటార్లను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## నేడు ఎంపీలతో సీఎం రేవంత్ భేటీ



**హైదరాబాద్:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలతో ప్రభుత్వం సమావేశం నిర్వహిస్తోంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రజాభవన్‌లో జరిగే ఈ భేటీకి హాజరు కావాలని అన్ని పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, పలు ప్రాజెక్టులకు రావాల్సిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల గురించి ఈ సమావేశంలో ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించనున్నారు. అన్ని పార్టీల భేటీ అనంతరం కాంగ్రెస్ ఎంపీలతో సీఎం డిన్నర్ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ విచారణ, మెట్రో రైలు, ఉపాధి హామీ పథకం అమలులో కేంద్ర వైఖరి తదితర అంశాలపై పార్టీ ఎంపీలు అనుసరించాల్సిన వైఖరి గురించి సీఎం రేవంత్ కాంగ్రెస్ ఎంపీలకు దిశానిర్దేశం చేయనున్నారు. పార్లమెంటులో ఏ ఎంపీ ఏ అంశంపై మాట్లాడాలనే పని విభజన చేయనున్నారు.



## 18 నుంచి అక్టోబర్ నెల తిరుమల దర్శన కోటా విడుదల

**తిరుమల, జూలై 12:** అక్టోబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల(సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను జూలై 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి.

### 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

### టోకెన్లు విడుదల

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. టిటిడి వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- ముంబయిలోని ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- విజయవంతంగా ముగిసిన భుజం శస్త్రచికిత్స
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ముఖ్యమంత్రి
- మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నారాయణతో కలిసి పరామర్శ



**ముంబయి, జూలై 12:** "భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భుజానికి శస్త్రచికిత్స అనంతరం ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న ఆయన పవన్ కల్యాణ్‌తో కొంతసేపు మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల నుంచి చికిత్స వివరాలను కూడా తెలుసుకున్నారు. ఈ పర్యటనలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నారాయణ పాల్గొన్నారు.

### విజయవంతమైన శస్త్రచికిత్స

పవన్ కల్యాణ్ కొంతకాలంగా కుడి భుజం నొప్పితో బాధపడుతున్నారు. గతంలో సినిమా చిత్రీకరణ సమయంలో తగిలిన గాయాల కారణంగా సమస్య తీవ్రం కావడంతో వైద్యుల సలహా మేరకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో వైద్యుల బృందం సుమారు మూడున్నర గంటల పాటు నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది.

### కోలుకుంటున్న పవన్ కల్యాణ్

ఇటీవలే సైనస్ సమస్యకు కూడా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్నారు. తాజా భుజం ఆపరేషన్ అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## ఆలమట్టి గరిష్ఠ స్థాయికి కృష్ణమ్మ

(మొదటిపేజీ తరువాయి)

టీఎంసీలు. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి 1.33 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. నేడో, రేపో ఆలమట్టి గేట్లు ఎత్తి వరదను దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయానికి విడుదల చేయనున్నారు. కృష్ణా నది ఎడారిలా మారిన వేళ ఇది శుభవార్తగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తి నిల్వ 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.47 టీఎంసీల మట్టం వద్ద ఉంది. ఈ జలాశయం కూడా గరిష్ఠ స్థాయికి చేరితే దిగువన ఉన్న జూరాలకు ప్రవాహాన్ని విడిచిపెడతారు. ఆలమట్టికి ఎగువ నుంచి ఇదే మాదిరి వరద కొనసాగితే వారంలో జూరాలకు నీటిని వదిలే అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీ వద్ద ప్రాణహిత నదీ ప్రవాహం తగ్గింది. మొన్నటి వరకు లక్ష క్యూసెక్కుల వరద రాగా ఆదివారం నాటికి 28,050కు చేరింది. ప్రాణహిత పరీవాహకంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రవాహం నెమ్మదించింది. మేడిగడ్డ దిగువన సమ్మక్క బ్యారేజీ వద్ద 49,400, భద్రాచలం సీతమ్మసాగర్ బ్యారేజీ వద్ద 90,898 క్యూసెక్కుల ప్రవాహం గోదావరిలో దిగువకు వెళ్తోంది. కృష్ణా, గోదావరి నదుల పరీవాహకాల్లో ఏ ఇతర భారీ, మధ్యతరహా ప్రాజెక్టులకు ప్రవాహాలు లేవు.

## విమర్శకులకు ప్రకాశ్ రాజ్ ఘాటు కౌంటర్

### సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసిన ప్రముఖ నటుడు

**హైదరాబాద్, జూలై 12:** "నేను మౌనంగా లేను... అన్నీ గమనిస్తున్నా. అబద్ధాలు, కట్టుకథలు, వ్యక్తిగత దూషణలతో ప్రశ్నించే గొంతుకలను ఎవరూ ఆపలేరు" అంటూ ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఉద్దేశిస్తూ ప్రకాశ్ రాజ్ ఒక వీడియోను విడుదల చేశారు. 'దిగజారండి' అనే పదాన్ని పదేపదే ఉపయోగిస్తూ విమర్శకులపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కొందరు సామాజిక మాధ్యమ కార్యకర్తలు, యూట్యూబ్ ఛానళ్లు తనపై అసత్య ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. తనపై జరుగుతున్న ప్రతి విషయాన్ని గమనిస్తున్నానని పేర్కొన్న ప్రకాశ్ రాజ్, అబద్ధాలు, కట్టుకథలు, వ్యక్తిగత దూషణలతో నిజాన్ని మార్చలేరని అన్నారు. ఎంతటి ప్రచారం చేసినా ప్రశ్నించే స్వరాలను అణచివేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. విమర్శకులను ఉద్దేశించి వ్యంగ్య ధోరణిలో చేసిన ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. ఆయన విడుదల చేసిన వీడియో ప్రస్తుతం వివిధ సామాజిక మాధ్యమ వేదికల్లో వైరల్‌గా మారింది.

## విజయవాడ ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం

### 7 ప్రైవేట్ బస్సుల దగ్ధం

**విజయవాడ, జూలై 12 :** విజయవాడలోని ఆటోనగర్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. 7 బస్సులు కాలిపోయాయి. మరమ్మతుల కోసం ఉంచిన బస్సులో మంటలు చెలరేగటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్డులో మరమ్మతుల కోసం బస్సులను నిలిపి ఉంచారు. ఆదివారం మధ్యాహ్నం మరమ్మతుల కోసం ఉంచిన ఓ బస్సులో మంటలు చెలరేగాయి. ఆ మంటలు కొద్దిసేపటికి మిగిలిన బస్సులకు వ్యాపించాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటం గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇక, ఈ ప్రమాదంలో గ్యారేజీలో నిలిపి ఉంచిన ఏడు బస్సులు దగ్ధం అయ్యాయి. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణం నష్టం సంభవించలేదని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.



## ఎన్డీఎస్ఏ సిఫార్సుల అమలులో ప్రభుత్వం విఫలం

### భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ కోసం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సిఫార్సులను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. ఆ సిఫార్సులను అమలుచేసి కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. "కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరావాస చర్యల నిర్వహణలో, ప్రాజెక్టు పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. ప్రాజెక్టును పునరుద్ధరించడానికి ఎన్డీఎస్ఏ సిఫార్సులను సకాలంలో అమలు చేయకపోవడం వల్ల అటు తాగునీరు, ఇటు సాగునీరు అందక రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిసెంబరు 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దాదాపు రెండున్నరేళ్లకుపైగా అది పలు నివేదికలను ఇచ్చింది. బ్యారేజీల కుంగుబాటుకు గల మూల కారణాలను కనుగొనడానికి జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆ సిఫార్సులను అమలు చేయడంలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ మూడు బ్యారేజీలను ఇప్పటికీ పునరుద్ధరించలేదు. దీనివల్ల ముఖ్యంగా ఈ ఏడాది కరవు పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు దాదాపు 200 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకోలేకపోయారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఈ ఏడాది జూన్ 30న ఈ మూడు బ్యారేజీలపై రాష్ట్రానికి మార్గదర్శనం చేయడానికి ఎన్డీఎస్ఏ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేసిందని నిన్న మీరు పేర్కొన్నారు. పునరావాస ప్రక్రియ బాధ్యత ఈ కమిటీదే అని మీరు చెప్పడం, డ్యామ్ యజమానిగా మీ బాధ్యత నుంచి తప్పుకోవడమే అవుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు జలాలను రాష్ట్ర ప్రజలకు వీలైనంత త్వరగా ఉపయోగపడేలా చూడాలి" అని రామచందర్‌రావు లేఖలో పేర్కొన్నారు.

## షాబాద్ ఆరు హత్యల కేసు..

### నిందితుడి కోసం 12 బృందాలతో గాలింపు

**షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. గాలింపు బృందాల సంఖ్యను 10 నుంచి 12కు పెంచారు. నిందితుడి కదలికలను గుర్తించేందుకు అతడు ఉపయోగించిన సిమ్ కార్డులతో పాటు బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండొచ్చనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్లే హైవేలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. 44వ నంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటళ్లు, దాబాలు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో తొలుత బాలిక తల్లి, నానమ్మలను రాజ్‌కుమార్ కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. ఈ ఆరు హత్యలు గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. పరారీలో ఉన్న నిందితుడిని పట్టిస్తే.. రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. ఈ ఘటన అనంతరం పోలీసు ఉన్నతాధికారులు షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేశారు.

## పైసా కొట్టు.. డైలాగ్ పట్టు

### ప్రకాశ్ రాజ్‌కు బండ్ల గణేశ్ కౌంటర్

- ప్రకాశ్ రాజ్ వీడియోకు సోషల్ మీడియాలో ఘాటు స్పందన
- ప్రజల మనసు గెలవాలంటే నిజాయతీ అవసరమని వ్యాఖ్య
- సినిమా డైలాగుల్లా మాట్లాడొద్దంటూ చురక
- నెట్టింట వైరల్‌గా మారిన ఇద్దరి పోస్టులు

**హైదరాబాద్, జూలై 12:** "ప్రజల మనసు గెలవాలంటే స్క్రిప్ట్ కాదు... నిజాయతీ కావాలి. సినిమాల్లో డైలాగులు చెప్పినట్లు కాకుండా హృదయం నుంచి మాట్లాడితేనే ప్రజలు నమ్ముతారు" అంటూ సినీ నిర్మాత బండ్ల గణేశ్, నటుడు ప్రకాశ్ రాజ్‌కు సోషల్ మీడియా వేదికగా ఘాటు కౌంటర్ ఇచ్చారు. తనపై జరుగుతున్న విమర్శలు, తప్పుడు ప్రచారాలపై స్పందిస్తూ ప్రకాశ్ రాజ్ ఎక్స్ వేదికగా వీడియోను విడుదల చేశారు. "ప్రశ్నించే గొంతుల మీద తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి నా సమాధానం" అంటూ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీసింది. ప్రకాశ్ రాజ్ వీడియోపై స్పందించిన బండ్ల గణేశ్, ఎవరితోనో రాయించి తెచ్చిన ట్వీట్‌ను పోస్ట్ చేయడం కాదని, ప్రజలతో మాట్లాడే మాట హృదయం నుంచి రావాలని వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే నటన కాదు, నిజాయతీ అవసరమని తన పోస్టులో పేర్కొన్నారు. అంతటితో ఆగని బండ్ల గణేశ్, మరో పోస్టులో "పైసా కొట్టు... డైలాగ్ పట్టు!" అంటూ ప్రకాశ్ రాజ్‌పై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఈ పోస్టులు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, ఇద్దరి మధ్య మాటల యుద్ధం నెట్టింట చర్చనీయాంశంగా మారింది.



# నాగారంలో "ఎస్ఐఆర్" ప్రత్యేక డ్రైవ్

- బిఎల్ఓలకు ఓటర్లు సహకరించండి
- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్, కొమిరెల్లి సుధాకర్ రెడ్డి

**నాగారం, జూలై 12 (జనం వార్త):** ఎస్ఐఆర్ జాబితా ప్రక్రియకు అర్హులైన ప్రతి ఒక్కరూ బిఎల్ఓ లకు సహకరించాలని నాగారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్,కొమిరెల్లి సుధాకర్ రెడ్డి ఓటర్లను కోరారు. నాగారం డివిజన్ పరిధిలోని శిల్పా నగర్, మామిళ్ల నారాయణ కాలనీ,ఎస్.వి నగర్, విజయపురి కాలనీలోని పిఎస్ నెంబర్ 232 నుండి 241 ఓటర్ జాబితా ప్రక్రియలో భాగంగా సూపర్వైజర్ ధర్మారెడ్డి,బూత్ లెవెల్ ఆఫీసర్ సబిత తో కలిసి ఆదివారం ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటర్ లిస్టులో పేరు ఉండి దరఖాస్తు ఫారం అందనివారు,దరఖాస్తు ఫారం పొందినవారు బిఎల్ఓ లను సంప్రదించి దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి వారికి అందజేశారు.



# ఆలయ నిర్మాణానికి సహకారం

## పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి

**నాగారం, జూలై 12 (జనం వార్త) : ఆలయ నిర్మాణ అభివృద్ధికి సహాయం చేయడం నా అదృష్టమని కాంగ్రెస్ పార్టీ నాగారం మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ హనుమాన్‌నగర్ కాలనీలో నిర్మిస్తున్న శివాలయ స్లాబ్ నిర్మాణానికి డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి సహాయ సహకారాలు అందించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ అభివృద్ధికి సహకరిస్తున్న ముప్పు శ్రీనివాస్ రెడ్డికి కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.**

# పీసీఎల్-6 జట్టుకు బలరామ్‌యాదవ్ ఆర్థిక సాయం

**శేరిలింగంపల్లి, జూలై 12 (జనం వార్త):** ఉప్పల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీసీఎల్-6 (ప్రిమియర్ క్రికెట్ లీగ్) టోర్నమెంట్‌లో పాల్గొంటున్న మియాపూర్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జట్టుకు ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరామ్ యాదవ్ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పానుగంటి గణేష్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు బలరామ్ యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జట్టు ప్రోత్సాహార్థం రూ.10 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బలరామ్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తాయని అన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడలకు సమాజంలోని ప్రతి వర్గం నుంచి ప్రోత్సాహం లభిస్తే మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. మియాపూర్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు వృత్తిపరమైన బాధ్యతలతో పాటు క్రీడా రంగంలోనూ చురుకుగా పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. టోర్నమెంట్‌లో జట్టు అత్యుత్తమ



ప్రతిభ కనబర్చి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు బలరామ్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన అందించిన ప్రోత్సాహం జట్టుకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, స్థానిక నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు ఎస్ఐఆర్ సవరణలో పాల్గొనాలి

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొంతి శేఖర్ ముదిరాజ్

**శేరిలింగంపల్లి, జులై 12 (జనం వార్త):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని మదినగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొంతి శేఖర్ ముదిరాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్యూమ రేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేయడం ద్వారా మాత్రమే ఓటరు నమోదు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. ఆదివారం మదినగూడ డివిజన్ పరిధిలోని గంగారం గ్రామం, సుభాష్‌నగర్, హుడా కాలనీల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌లను సందర్శించి, ఓటర్లతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో పూర్తి చేసి సమర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దొంతి శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం కల్పించిన ఈ ప్రత్యేక అవకాశాన్ని ప్రతి అర్హత కలిగిన ఓటరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని వారు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సరిచూసుకొని అవసరమైన పత్రాలతో బీఎల్‌వోలను సంప్రదిం చి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని, ఎస్ఐఆర్ కార్యక్రమంలో అందరూ చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని దొంతి శేఖర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.







# సర్ పత్రాల పంపిణీ, స్వీకరణల పూర్తి బాధ్యత బి.ఎల్.ఓ లదే

## కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో బి.ఎల్.ఓ లు నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలని మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. ఆదివారం జిల్లాలోని కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న సర్ ప్రక్రియను జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ తో కలిసి కలెక్టర్ పర్యవేక్షించారు. బి.ఎల్.వో లు ఎన్యూమరేషన్ ఫారాలను ఇవ్వడంలోనూ అదే విధంగా పూరించిన ఫారాలను తీసుకోవడంలోనూ పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఫారాలు పూరించడంలో ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. సర్ ప్రక్రియను వేగవంతం చేస్తూనే, తీసుకున్న ఫారాలను వెంట వెంటనే డిజిటలైజ్ చేయించాలని బిఎల్ఓలను ఆదేశించారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సూపర్వైజర్లకు అందించాలని బిఎల్ఓ లను కోరారు. అంతకుముందు కూకట్పల్లిలోని 371, 372, 373, 374 పోలింగ్ స్టేషన్లలో నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడారు. వారి సందేహాలను నివృత్తి చేస్తూ, ఫారాలను ఏ విధంగా పూరించాలనే అంశంపై అవగాహన కల్పించారు.



# వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు

## ప్రత్యేక పూజలతో విడుదల చేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**ఏన్కూరు :** మండలంలోని తిమ్మారావుపేట గ్రామ సమీపంలోని ఎన్ఎస్పి కెనాల్ ఎస్కేప్ లాకుల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. రైతులు సాగు చేసిన ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించడం వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను అందించేందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ వంటి రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి ప్రతి రైతు కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ స్పష్టం చేశారు.

# వాట్సాప్ స్క్రీన్ షేర్ చేస్తే మీ ఖాతా ఖాళీ

**సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ తరుణంలో ప్రజలు మోసాల బారిన పడకుండా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ప్రజలను దోచుకుంటున్నారు. డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, ఓటీపీ తరహా సైబర్ మోసాలపై పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో కొత్తగా వాట్సప్ స్క్రీన్ షేరింగ్‌తో మోసాలను మొదలుపెట్టారు.**

కస్టమర్ సపోర్ట్, బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి మీ అకౌంట్‌లో సమస్యలున్నాయని లేదా ఇ-కేవైసీ అప్‌డేట్ చేయాలని కేటుగాళ్లు నమ్మబలుకుతారు. వెంటనే చేయకపోతే అకౌంట్ బ్లాక్ అవుతుందంటూ కంగారు పెడతారు. అసలు ఆలోచించడానికే సమయం ఇవ్వరు. మీరు వీడియో కాల్ చేసి వాట్సప్ స్క్రీన్ షేర్ చేస్తే ఆ ప్రక్రియంతా తామే పూర్తి చేస్తామని నమ్మబలుకుతారు. వారి మాటలు నమ్మి ఒకసారి స్క్రీన్ షేర్ చేశారో ఇక అంతే మీ ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లినట్లే. మీ ఖాతాల్లో సొమ్ము మొత్తం ఖాళీ చేస్తారు. ఇటీవల కాలంలో ఈ తరహా నేరాలు పెరిగిపోతున్నాయి. దీంతో ఎవరు ఫోన్ చేసి స్క్రీన్ షేర్ చేయమని అడిగినా ఎట్టి పరిస్థితుల్లో చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

## స్క్రీన్ షేరింగ్ మోసం ఇలా..

స్క్రీన్ షేరింగ్ అంటే ఒక డివైజ్ స్క్రీన్ ఇంకొక డివైజ్‌లో డిస్‌ప్లే అవ్వడం. హ్యాకర్ ఎవరినైతే లక్ష్యంగా చేసుకుంటాడో అతడి వాట్సప్ స్క్రీన్‌షేరింగ్‌ను తన కంప్యూటర్‌లో కనిపించేలా చేస్తాడు. సాధారణంగా వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేటప్పుడు సాంకేతికంగా సమస్య తలెత్తిన సందర్భాల్లో నిపుణులు స్క్రీన్ షేర్ లేదా రిమోట్‌గా మన పీసీని ఆపరేట్ చేస్తుంటారు. అదే తరహాలో మిమ్మల్ని మాటల్లో పెట్టి మీ ఫోన్‌లో చేసే ప్రతిదీ నేరగాళ్లు తెలుసుకుంటారు. పిన్, పాస్‌వర్డ్, ఓటీపీలన్నీ చూస్తారు. తద్వారా మీ ఖాతాలోని నగదు కాజేస్తారని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

## అస్సలు నమ్మొద్దు: పోలీసులు

"కస్టమర్ సపోర్ట్, బ్యాంక్ సిబ్బంది పేరిట కాల్స్ చేసి వాట్సప్ స్క్రీన్ షేరింగ్ ఇవ్వాలని కోరితే అస్సలు నమ్మొద్దు. సాయం చేస్తామని నమ్మించి మీ అకౌంట్‌లోని డబ్బులు కాజేస్తారు. ఖాతా వివరాలు, ఓటీపీ తస్కరిస్తారు. అపరిచిత కాల్స్‌తో అప్రమత్తంగా ఉండండి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఏమరపాటుగా ఉండొద్దు. మీ సన్నిహితులు, ఇంట్లోని పెద్దలకు ఇలాంటి మోసాలపై అవగాహన కల్పించండి" అని పోలీసులు కోరుతున్నారు. ఇవే కాదు.. వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఇన్వెస్ట్‌మెంట్ టిప్స్ నమ్మొద్దని హితవు పలుకుతున్నారు. ఈజీమనీ ఆశతో ఎలాంటి లింక్‌లపైనా క్లిక్ చేయొద్దని, వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఇాఖ ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేయొద్దని పోలీసులు సూచిస్తున్నారు.



జనం వార్త

# డ్రై ఫ్రూట్స్

## ఏ సమయంలో తినాలి..?



మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచడం కోసం అనేక రకాల పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో డ్రై ఫ్రూట్స్ కూడా ఒకటి. కిస్మిస్‌లు, అంజీర్, ఆలుబుఖర వంటివి డ్రై ఫ్రూట్స్ జాబితాకు చెందుతాయి. అంజీర్, ఆలుబుఖరతోపాటు యాప్రికాట్స్ కూడా మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక డ్రై ఫ్రూట్స్‌ను చాలా మంది తింటుంటారు. డ్రై ఫ్రూట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. పలు వ్యాధులను నయం చేయడంలోనూ డ్రై ఫ్రూట్స్ మనకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను రోజులో అసలు ఏ సమయంలో తినాలి..? ఎప్పుడు వీటిని తింటే మనకు అధిక శాతం లాభాలు కలుగుతాయి..? అని చాలా మందికి ప్రశ్నలు తలెత్తుతుంటాయి. ఇక ఇందుకు పోషకాహార నిపుణులు సమాధానాలు చెబుతున్నారు.

### ఏ సమయంలో తినాలి..?

డ్రై ఫ్రూట్స్ లలో మన శరీరానికి కావల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సితోపాటు పొటాషియం, మెగ్నిషియం, జింక్ వంటి మినరల్స్‌ను మనం డ్రై ఫ్రూట్స్ ద్వారా పొందవచ్చు. ఈ క్రమంలో ఈ పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి. అయితే డ్రై ఫ్రూట్స్ ను ఉదయం తింటేనే అధిక మొత్తంలో లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం వీటిని బ్రేక్ ఫాస్ట్ తోపాటు కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. దీని వల్ల అధిక మొత్తంలో పోషకాలు, ఆరోగ్యకర ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

### రోజంతా యాక్టివ్‌గా..

రాత్రంతా మన శరీరానికి ఎలాంటి ఆహారం లభించదు. సుమారుగా 10 నుంచి 14 గంటల పాటు శరీరం ఉపవాస దశలో ఉంటుంది. కనుక ఉదయం పూట శరీరానికి పెద్ద ఎత్తున శక్తి అవసరం అవుతుంది. ఈ క్రమంలో డ్రై ఫ్రూట్స్ ను తినడం వల్ల ఆ శక్తిని చాలా వరకు భర్తీ చేయవచ్చు. పైగా ఉదయం నుంచి మనం పనుల్లో యాక్టివ్‌గా ఉంటాం. కొందరు శారీరక శ్రమ కూడా చేస్తుంటారు. కనుక ఉదయం మన శరీరానికి శక్తి అధికంగా అవసరం అవుతుంది. ఇలాంటి సమయంలో డ్రై ఫ్రూట్స్ ను తింటే కావల్సినంత శక్తి లభిస్తుంది. దీంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ధకం పోతుంది. కనుక డ్రై ఫ్రూట్స్ ను ఉదయం పూట తింటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

# బ్రౌన్ రైస్ వర్సెస్ రెడ్ రైస్

## ఎందులో పోషకాలు ఎక్కువ



ఆరోగ్యంగా ఉండేందుకు గాను చాలా మంది ప్రస్తుతం తెల్ల అన్నంకు బదులుగా బ్రౌన్ రైస్ తింటున్నారు. బ్రౌన్ రైస్‌ను రోజూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. తెల్ల అన్నానికి బదులుగా రోజూ బ్రౌన్ రైస్‌ను తింటే పలు వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చు. అయితే రైస్‌లో కేవలం బ్రౌన్ రైస్ మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన రైస్ వెరైటీలు ఇంకా అనేకం ఉన్నాయి. వాటిల్లో రెడ్ రైస్ కూడా ఒకటి. ఈ వెరైటీ కూడా మనకు మార్కెట్‌లో లభిస్తుంది. అయితే దీని రంగు కారణంగా చాలా మంది దీన్ని తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఈ రైస్ కూడా మనకు అనేక లాభాలను అందిస్తుంది. బ్రౌన్ రైస్‌తో పోలిస్తే రెడ్ రైస్ లోనూ అనేక పోషకాలు ఉంటాయి. అయితే ఈ రెండింటిలో దేన్ని మనం తినాలి, ఎందులో ఎక్కువ పోషకాలు ఉంటాయి..? అన్న వివరాలను పోషకాహార నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఫైబర్ విషయానికి వస్తే ఇది బ్రౌన్ రైస్, రెడ్ రైస్ రెండింటిలోనూ ఉంటుంది. కానీ రెడ్ రైస్‌లో ఇది కాస్త ఎక్కువ మోతాదులో ఉంటుంది. కనుక ఫైబర్ విషయంలో రెడ్ రైస్‌ను విన్నర్‌గా చెప్పవచ్చు. అలాగే గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ బ్రౌన్ రైస్ కన్నా రెడ్ రైస్‌కే తక్కువగా ఉంటుంది. కనుక షుగర్ ఉన్నవారికి బ్రౌన్ రైస్ కన్నా రెడ్ రైస్ ఎక్కువ మేలు చేస్తుంది. కాబట్టి ఈ విషయంలోనూ రెడ్ రైస్‌ను విజేతగా చెప్పవచ్చు. అలాగే బ్రౌన్ రైస్‌తో పోలిస్తే రెడ్ రైస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇక ఈ రెండింటిలోనూ మెగ్నిషియం, ఫాస్ఫరస్ సమానంగానే ఉంటాయి. కానీ ఐరన్, జింక్ వంటి పోషకాలు మాత్రం రెడ్ రైస్‌లోనే అధికంగా ఉంటాయి. కనుక ఈ రెండు రకాల రైస్‌లలోనూ రెడ్ రైస్‌ను క్లియర్ విన్నర్ అని చెప్పవచ్చు. కనుక పోషకాల విషయానికి వస్తే రెడ్ రైస్‌లోనే అధికంగా ఉంటాయి. కాబట్టి బ్రౌన్ రైస్‌ను తింటున్నవారు ఈ రైస్‌ను తింటే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది.



### రెడ్ రైస్‌తో అనేక లాభాలు..

రెడ్ రైస్‌ను తినడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. ఇందులో ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కనుక ఈ రైస్‌ను తింటే శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా రక్త నాళాల వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రెడ్ రైస్‌ను తినడం వల్ల అధిక మొత్తంలో ఐరన్‌ను పొందవచ్చు. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. దీని వల్ల రక్తహీనత తగ్గుతుంది. అలాగే ఈ రైస్‌ను తింటే జింక్ కూడా ఎక్కువగానే లభిస్తుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీని వల్ల దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. అలాగే పురుషుల ఆరోగ్యం మెరుగు పడుతుంది. వీర్యం అధికంగా ఉత్పత్తి అవుతుంది. సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి. అదేవిధంగా చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

### గుండె ఆరోగ్యానికి..

ఇక రెడ్ రైస్‌ను తింటే మెగ్నిషియం అధికంగా లభిస్తుంది. ఇది రక్త నాళాలను వెడల్పు చేస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ రైస్ ఎంతో మేలు చేస్తుంది. అలాగే గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. రెడ్ రైస్‌ను తినడం వల్ల క్యాల్షియం అధికంగా లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ రైస్‌లోని మెగ్నిషియం కండరాల నొప్పులను తగ్గిస్తుంది. దీని వల్ల రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోవడం కూడా తగ్గుతుంది. రెడ్ రైస్‌ను తింటుంటే షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఈ రైస్‌లో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా రెడ్ రైస్ వల్ల మనకు అనేక లాభాలు ఉంటాయి. కనుక బ్రౌన్ రైస్ తింటున్నవారు ఈ రైస్‌ను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోండి. దీని వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# కాలం దాచుకున్న తిరిగిరాని జ్ఞాపకాలు..

## 90ల బాల్యం.. చెరిగిపోని మధుర స్మృతులు

**సౌకర్యాలు తక్కువైనా సంతోషాలకు కొదవలేని రోజులు**

**స్మార్ట్‌ఫోన్లు లేని ప్రపంచంలో స్నేహాలు, అనుబంధాలే అసలైన సంపద**

**వీధులే ఆటస్థలాలు.. ప్రకృతే పాఠశాల.. జ్ఞాపకాలుగా మిగిలిన బాల్యం**

**నేటి డిజిటల్ తరానికి ఆదర్శంగా నిలిచే ఆనాటి జీవనశైలి**


జీవితంలో కొన్ని కాలాలు తిరిగి రావని తెలిసినా, మనసు మాత్రం వాటి కోసం పదేపదే వెతుకుతూనే ఉంటుంది. బాధ్యతల బరువుతో, కాలంతో పోటీ పడుతున్న ఈ రోజుల్లో ఒక్కసారిగా పాత పాట వినిపించినా, చిన్ననాటి స్నేహితుడు ఎదురైనా, దుమ్ముపట్టిన పాత ఫోటో కనిపించినా మనసు క్షణాల్లో కాలాన్ని వెనక్కి తిప్పేస్తుంది.


మట్టివాసనతో నిండిన వీధులు.. సాయంత్రం ఆటల సందడితో కళకళలాడిన మైదానాలు.. అమ్మమ్మ ఇంటి ఆవరణ.. తాతయ్య చెప్పిన కథలు.. కాల్వల్లో ఈతలు.. సైకిల్‌పై చేసిన ప్రయాణాలు.. ఇవన్నీ కేవలం జ్ఞాపకాలు కాదు. ఒక తరం అదృష్టంగా జీవించిన బాల్యం తాలూకు స్వర్ణయుగానికి నిలువెత్తు గుర్తులు. ఆ యుగం పేరు: 90ల బాల్యం.

**హైదరాబాద్ :** నేటి పిల్లలకు మొబైల్ స్క్రీన్‌లు ఆటస్థలాలైతే, 90ల పిల్లలకు వీధులే వినోద ప్రపంచం. క్రికెట్ ఆడాలంటే అందరూ కలిసి చందాలు వేసి బాల్ కొనేవారు. బాల్ పోతే అందరూ వెతికేవారు. ఒక బ్యాట్, ఒక బాల్, పది మంది స్నేహితులు ఉంటే చాలు ఆ రోజు పండుగే. గోళీలు, గిల్లీదండా, తొక్కుడు బిళ్ళ, కబడ్డీ, కోకో, దాగుడుమూతలు, చెరపట్టి. ప్రతి ఆటలోనూ ఆనందం, ప్రతి ఓటమిలోనూ పాఠం ఉండేది. ఆ ఆటలు కేవలం కాలక్షేపం కాదు. ఐకమత్య భావన, నాయకత్వం, సహనం, పరస్పర గౌరవం వంటి జీవిత విలువలను నేర్పిన గురువులు.



జి.అజయ్ కుమార్









### కాల్వల్లో ఈతలు... సైకిళ్లపై స్వప్నాలు

ఈత నేర్చుకోవడానికి కోచ్‌లు అవసరం లేదు. కాల్వలు, చెరువులే గురువులు. నీటిలో గంటల తరబడి గడిపినా అలసట అనిపించేది కాదు. సైకిల్ తొక్కడం ప్రతి పిల్లాడి జీవితంలో ఒక మైలురాయి. కిందపడటం, గాయపడటం, మళ్లీ లేచి తొక్కడం జీవితంలో ఎదు-రయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం అప్పుడే నేర్పేది. రెండు చక్రాలపై నడిచింది కేవలం సైకిల్ కాదు, ఎన్నో చిన్న చిన్న కలలు.

### అమ్మమ్మ ఊరు... ప్రతి బాల్యానికి ఒక స్వర్గం

వేసవి సెలవులు అంటే 90ల పిల్లలకు ఆనందాల పండుగ. అమ్మమ్మ, నానమ్మ ఊర్లకు వెళ్లే రోజు కోసం నెలల తరబడి ఎదురు చూసేవారు. మామిడి తోటలు, పచ్చని పొలాలు, బంధువులతో ఆటలు, డాబాపై పడుకుని నక్షత్రాలు లెక్కించడం, తాతయ్య చెప్పే నీతి కథలు ఇవన్నీ నేటి పిల్లలకు దాదాపు తెలియని అనుభవాలుగా మారిపోయాయి. జాతరలు, వీధి నాటకాలు, బుర్రకథలు, సర్కస్‌లు వస్తే ఊరంతా సంబరపడేది. అప్పట్లో కొన్న చిన్న బొమ్మ ఇచ్చిన ఆనందం, నేడు వేల రూపాయల గ్యాడ్జెట్లు కూడా ఇవ్వలేకపోతున్నాయి.

### స్నేహానికి విలువిచ్చిన తరం

90లలో స్నేహం అంటే సోషల్ మీడియా ఫ్రెండ్ రిక్వెస్ట్ కాదు. జీవితాంతం నిలిచిపోయే అనుబంధం. ఒకరి టిఫిన్ బాక్స్ అందరిదీ. ఒకరి సైకిల్ అందరిదీ. ఒకరి సమస్య అందరిదీ. స్నేహితుడి కోసం కిలోమీటర్ల దూరం నడిచేవారు. కష్టంలో భుజం తట్టేవారు. అందుకే ఆ రోజుల్లో ఏర్పడిన స్నేహాలు దశాబ్దాలు గడిచినా చెక్కుచెదరకుండా నిలిచిపోయాయి.

### సాంకేతికత పెరిగింది... కానీ సంబంధాలు?

ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. సమాచారానికి దూరాలు తగ్గాయి. కానీ మనుషుల మధ్య దూరాలు పెరిగాయి. నేటి పిల్లలు వేలాది ఫోటోలు తీసుకుంటున్నారు. కానీ గుండెల్లో నిలిచిపోయే జ్ఞాపకాలు తగ్గిపోతున్నాయి. వందలాది మంది ఆన్‌లైన్ స్నేహితులు ఉన్నా, కష్టంలో భుజం తట్టే నిజమైన స్నేహితుడు దొరకడం అరుదైపోతోంది. సాంకేతికత జీవితాన్ని సులభతరం చేసింది. కానీ ఆనందాన్ని కాదు. ఎందుకంటే ఆనందం ఇప్పటికీ యంత్రాల్లో కాదు, మనుషుల్లోనే ఉంది.



## 90ల తరం నుంచి నేటి తరం
# నేర్చుకోవాల్సిన పాఠాలు

- సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, జీవితాన్ని అందంగా మార్చేది మానవీయ విలువలే. 90ల తరం ప్రకృతితో మమేకమై పెరిగింది. స్క్రీన్‌లకు అతుక్కుపోయే బదులు ప్రకృతికి దగ్గరగా ఉండటం మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. కుటుంబ సభ్యులతో మాట్లాడటం, స్నేహితులతో సమయం గడపడం, అనుబంధాలను కాపాడుకోవడం 90ల తరం ప్రత్యేకత. నిజమైన సంబంధాలకు ప్రత్యామ్నాయం ఏ గ్యాడ్జెట్ కూడా కాదు. అలాగే ఓర్పు, సహనం, కష్టపడే తత్వం ఆ తరానికి ఉన్న గొప్ప బలాలు. వెంటనే ఫలితాలు ఆశించే నేటి తరానికి ఇవి ఎంతో అవసరం.
- ఆనందం ఖరీదైన వస్తువుల్లో కాకుండా మనుషుల్లో, చిన్న చిన్న అనుభవాల్లో ఉ ంటుందని 90ల తరం నిరూపించింది. కలిసి జీవించడం, సుఖదుఃఖాలను పంచుకోవడం, మానవీయ విలువలను గౌరవించడం వంటి అంశాలు నేటి తరం తప్పక నేర్చుకోవాల్సిన జీవిత పాఠాలు.
- కాలం ఎంత వేగంగా పరుగులు తీసినా, కొన్ని జ్ఞాపకాలు మాత్రం మనసు మూలల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. 90ల బాల్యం అలాంటి ఓ అపురూపమైన జ్ఞాపకం. అది కేవలం ఒక కాలం కాదు. నవ్వుల నిధి, స్నేహాల సవ్వడి, బంధాల పరిమళం, అమాయకత్వానికి ప్రతిరూపం.
- ఆ రోజుల్లో ఇంటర్నెట్ లేదు... కానీ ఇంటి ముందు స్నేహితుల గుంపు ఉండేది. స్మార్ట్‌ఫోన్‌లు లేవు... కానీ గంటల తరబడి మనసులు విప్పి మాట్లాడుకునే మనుషులు ఉండేవారు. ఖరీదైన ఆటబొమ్మలు లేకపోయినా, చిన్న చిన్న ఆటల్లోనే అపారమైన ఆనందం ఉండేది. సౌకర్యాలు తక్కువైనా, సంతోషాలు మాత్రం కొలవలేనివి.
- నేడు ప్రపంచం మన అరచేతిలోకి వచ్చేసింది. కానీ ఆ రోజుల్లో మనుషులు మన హృదయాల్లో ఉండేవారు. సాంకేతికత మన జీవితాలను సులభం చేసింది, కానీ ఆ బాల్యం ఇచ్చిన ఆప్యాయతను, అనుబంధాన్ని, నిస్వార్థ స్నేహాలను మాత్రం భర్తీ చేయలేకపోయింది. ఎందుకంటే జీవితాంతం గుర్తుండేది మనం కొన్న వస్తువులు కాదు, మనతో కలిసి నవ్విన మనుషులు, మనం గడిపిన ఆ మధుర క్షణాలు.
- మాకు ఇంటర్నెట్ లేదు... కానీ ఇంటి ముందు స్నేహితులు ఉండేవారు.
- మాకు స్మార్ట్‌ఫోన్‌లు లేవు... కానీ హృదయాలను తాకే సంభాషణలు ఉండేవి.
- మాకు విలాసాలు లేవు... కానీ విలువలు ఉండేవి. సౌకర్యాలు తక్కువే... కానీ జీవితాంతం మోసుకెళ్లే జ్ఞాపకాలు అపారం.
- 90ల బాల్యం ముగిసిపోయి ఉండొచ్చు... కానీ ఆ జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ ముగియవు. మన జీవిత పుస్తకంలో అత్యంత అందమైన అధ్యాయంగా, మనసు తడిచే ప్రతిసారీ తిరిగి చదవాలనిపించే ఓ మధుర గాథగా,హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి.

నిద్ర పట్టకపోవడం, గుండె దడ, పదిమందిలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారా ? అయితే మీరు ఫోబియాతో బాధపడుతున్నట్లే. కొన్నాళ్లుగా ఇలాంటి వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. 30 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న వారిలో ఈ సమస్య అధికంగా కనిపిస్తోందని, నిర్లక్ష్యం వహిస్తే మానసిక సమస్యల బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ తరహా సమస్యతో బాధపడుతూ పట్టణ పరిధిలోని మానసిక వైద్య నిపుణుల వద్దకు ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు రోగులు వస్తున్నారని, గతంలో నెలకు ఐదుకు మించి కేసులు వచ్చేవి కావంటున్నారు.

ఫోబియాను రెండు రకాలుగా చెబుతారు. ఏదైనా వస్తువు, జంతువులు, ఇతర అంశాల పట్ల కలిగే భయం వల్ల వచ్చే దానిని ఇండివిడ్యువల్ లేదా జూ ఫోబియా అంటారు. పదిమందిలోకి వెళ్లేందుకు భయపడినా, గుండె దడ, ప్రతిదానికీ ఆందోళన వంటి లక్షణాలుంటే క్లాస్టరో ఫోబియా అంటారు. ఈ ఫోబియాతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోందని, దీనికి అనేక అంశాలు కారణమంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం స్నేహితులకు దూరంగా ఉండడం, పదిమందితో మాట్లాడితే ఎదుటివారు ఏమనుకుంటారో అని ఆత్మనూన్యతా భావం కలిగి ఉండడం లాంటి సమస్యలు ప్రధానంగా ఉంటాయి.



# ఫోబియా పరేషాన్

- ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య
- 30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో అధికం
- నిద్ర పట్టకపోవడం, గుండె దడ, భయం తదితర లక్షణాలు
- కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు
- సోషల్ మీడియా వినియోగం, మెదడుపై అధిక ఒత్తిడే కారణం
- మైర్మెకోఫోబియాతో గృహిణి మనీష ఉరి వేసుకుని ఆత్మహత్య
- సకాలంలో గుర్తిస్తే చెక్ చెప్పే అవకాశం
- లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి

: డాక్టర్.బత్తుల శ్రీధర్, సైకాలాజిస్ట్





## ఇవీ ప్రధాన లక్షణాలు :

క్లాస్ట్రో ఫోబియాతో బాధపడే వారిలో నిద్ర పట్టకపోవడం, గుండెదడ, భయం, ఆందోళన, యాంగ్జైటీ, రెస్ట్స్ ఊపిరి ఆడకపోవడం, బీపీ పెరుగుతుండడం వంటి లక్షణాలు ఉంటాయి. ఎక్కువ మందిలోకి వెళ్లినా, ఎవరితోనైనా మాట్లాడేందుకు ప్రయత్నించినా ఇటువంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. దీనికి అనేక అంశాలు కారణమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబసమస్యలు, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులు, మెదడుపై అధిక ఒత్తిడి. ఆత్మన్యూనతాభావం, సోషల్ మీడియాను అధికంగా వినియోగించడం వల్ల మెదడుకు విశ్రాంతి లేకుండా చేయడం వల్ల సమస్య బారినపడేస్తుందంటున్నారు. కొందరిలో కుటుంబ నేపథ్యం సైతం కారణమంటున్నారు ఆరోగ్య నిపుణులు.

## ఫోబియా నుంచి బయటపడే మార్గమేదీ ? :

ఈ సమస్య నుంచి బయటపడేందుకు కొన్ని అంశాలు దోహదపడతాయి. యోగా, మెడిటేషన్, మ్యూజిక్ వినడం, మనసుకు ఉత్సాహాన్ని కలిగించే ఆటలాడడం, శారీరక శ్రమ, పుస్తకాలు చదవడం, కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపించడం వంటి ఉపకరిస్తాయి. కొన్ని సందర్భాల్లో మందులు, కౌన్సెలింగ్ అవసరమవుతుంది.

## ఫోబియా భయాలు :

- అరాక్నో ఫోబియా- సాలెపురుగులంటే భయం
- సైనో ఫోబియా- కుక్కలంటే భయం
- ఎంటమో ఫోబియా- కీటకాలను చూస్తే భయం
- ఓఫిడియో ఫోబియా- పాములంటే భయం
- మైర్మెకో ఫోబియా- చీమలను చూస్తే భయం
- ఆక్రోఫోబియా- ఎత్తయిన ప్రదేశాలంటే భయం
- అగోరా ఫోబియా- బహిరంగ ప్రదేశాల్లో భయం
- ఆస్ట్రో ఫోబియా- ఉరుములు, మెరుపులు చూస్తే భయం



## లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి




ఫోబియా లక్షణాలను గుర్తించి వెంటనే అప్రమత్తం కావాలి. కుటుంబ సభ్యులతో కలిసి మానసిక వైద్య నిపుణులు, సైకాలజిస్టులను సంప్రదించాలి. గుండె దడ, నిద్ర పట్టకపోవడం, తీవ్రమైన ఆందోళన వల్ల ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎవరికీ చెప్పుకోలేక, బయటకు రాలేక మదనపడుతుంటారు. వారికి వైద్యసహాయం అందించాలి. నిపుణుల సలహా మేరకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. లేదంటే తీవ్రమైన మానసిక సమస్యలకు కారణవవుతుంది. కొన్నిసార్లు మ్యూజిక్ వినడం, మెడిటేషన్, యోగా ద్వారా సమస్య నుంచి బయటపడే వీలుంది. పోషకాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, మద్యం, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకపోవడం ఇతర పనుల్లో నిమగ్నం కావడం వల్ల ఈ ఫోబియాలను నుంచి దూరం కావచ్చు.

- డాక్టర్.బత్తుల శ్రీధర్, సైకాలాజిస్ట్

## మైర్మెకోఫోబియాతో గృహిణి మనీష ఉరి వేసుకుని ఆత్మహత్య :

చీమలు నన్ను బతకనివ్వవు.. నేను వెళ్లిపోతున్నా.... పాపను బాగా చూసుకోండి అంటూ ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాలకు చెందిన చిందం శ్రీకాంత్, మనీషా (25) దంపతులతో పాటు వారి మూడేళ్ల పాప అనికతో కలిసి అమీన్ పూర్ పురపాలక సంఘం పరిధిలో గల నవ్య కాలనీలో నివాసముంటున్నారు. అయితే మనీషకు చిన్నప్పటి నుంచి చీమలకు భయపడే మైర్మెకోఫోబియా అనే వ్యాధి ఉండడంతో మనీష భర్త శ్రీకాంత్ ఆఫీస్ కు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా లోపల నుంచి గడియ పెట్టి ఉంది. స్థానికుల సహాయంతో డోర్ పగలగొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్కు మనీషా చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె పక్కనే దొరికిన లేఖలో చీమలు భరించడం తన వల్ల కావడం లేదని, అందుకే చనిపోతున్నానని పేర్కొంది. కూతురు అనికాను జాగ్రత్తగా చూసుకోమని చెప్తూ వదిలి వెళ్తున్నందుకు క్షమించాలని భర్తను వేడుకుంది. అన్నవరం తిరుపతి హుండీలో రూ.1,116 వేయడంతో పాటు ఎల్లమ్మ తల్లికి ఒడి బియ్యం పోయాలని లేఖలో తెలిపింది. ఎప్పుడూ వినని సమస్యతో మహిళ ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా విషాదం నింపింది.










# టీజీ20 లీగ్ విజేతగా

# హైదరాబాద్ ఈ ఛాంపియన్స్

**టీజీ20 తొలి సీజన్ విజేతగా నిలవడంతో హైదరాబాద్ ఆటగాళ్లు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. మైదానంలో కలియ తిరుగుతూ.. తమకు మద్దతుగా నిలిచిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. టీజీ20 లీగ్ ఫైనల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా హైదరాబాద్ స్పిన్నర్ యశ్వీర్ గౌడ్ నిలిచాడు. ఈ మ్యాచ్‌లో యశ్వీర్ నాలుగు ఓవర్లు వేసి 17 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.**





హైదరాబాద్: టీజీ20 లీగ్ తొలి సీజన్ విజేతగా హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ నిలిచింది. ఖమ్మం ఏసెస్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 158 పరుగుల లక్ష్యాన్ని ఈ ఛాంపియన్స్ 17.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అభిరథ్‌రెడ్డి (48; 30 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి రాణించాడు. వైష్ణవ్ రెడ్డి (41; 28 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. షణ్ముఖ అశ్విన్ (36; 21 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రణవ్ వర్మ (19; 16 బంతుల్లో 2 ఫోర్లు) పరుగులు చేశారు. ఖమ్మం బౌలర్లలో హర్షిత్ సాయి, విద్యానందరెడ్డి, వేద్‌రెడ్డి, షేక్ అజర్ తలో వికెట్ తీశారు.

లక్ష్యఛేదనలో సాయివికాస్ (4) ఆరంభంలోనే వెనుదిరిగినా.. అభిరథ్, షణ్ముఖ అశ్విన్ నిలకడగా ఆడారు. ఈ జోడీ రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించింది. తర్వాత వైష్ణవ్, అభిరథ్ జట్టును విజయం దిశగా నడిపించారు. అభిరథ్‌ను షేక్ అజార్ వెనక్కి పంపాడు. తర్వాత వచ్చిన యశ్వీర్ (5)ని వేద్ రెడ్డి ఔట్ చేశాడు. ప్రణవ్‌తో కలిసి వైష్ణవ్ మ్యాచ్‌ను ముగించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం ఏసెస్ నిర్ణీత 20 ఓవర్లలో 157/8 పరుగులు చేసింది. మికిల్ జైస్వాల్ (65; 39 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిశాడు. హిమతేజ (31), ప్రతీక్ రెడ్డి (15), విద్యానంద రెడ్డి (20లి) పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో యశ్వీర్ గౌడ్ 3 వికెట్లు, దేవ్ మెహతా, అజయ్ గౌడ్ చెరో 2 వికెట్లు, అఖిల్ రాథోడ్ ఒక వికెట్ తీశారు.

**హాజరైన ప్రముఖులు..**

టీజీ20 ఫైనల్ మ్యాచ్‌ను పలువురు ప్రముఖులు వీక్షించారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీజీ20 లీగ్ బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ, డీజీపీ సీవీ ఆనంద్, సినీ నటులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యం రాజేశ్ తదితరులు మ్యాచ్‌ను ఆస్వాదించారు. మ్యాచ్‌కు ముందు రాహుల్ సిప్లిగంజ్ మ్యూజిక్ కాన్సర్ట్ అలరించింది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**అభిరథ్‌కు అవార్డుల పంట..**



- హైదరాబాద్ కెప్టెన్ అభిరథ్‌రెడ్డికి ఆరెంజ్ క్యాప్ దక్కింది. అదేవిధంగా 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు కూడా గెలుచుకున్నాడు. ఈ టోర్నీలో 10 మ్యాచ్‌లు ఆడిన అభిరథ్ 541 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ ఉన్నాయి. ఎక్కువ ఫోర్లు, సిక్స్‌ల అవార్డులూ అభిరథ్‌కే దక్కాయి. ఈ సీజన్‌లో 58 ఫోర్లు, 33 సిక్స్‌లు బాదాడు.
- హైదరాబాద్ పేసర్ అజయ్ దేవ్ గౌడ్.. పర్పుల్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. మొత్తం 21 వికెట్లు తీశాడు.
- ఖమ్మం ప్లేయర్ మికిల్ జైస్వాల్‌కు 'ఇన్‌క్రెడిబుల్ మూమెంట్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కింది. అదేవిధంగా 'బెస్ట్ క్యాచ్ ఆఫ్ ది సీజన్' అవార్డు అందుకున్నాడు.
- వరంగల్ ప్లేయర్ అమన్ రావు.. 'సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్' అవార్డు సొంతం చేసుకున్నాడు. ఈ సీజన్‌లో అమన్ స్ట్రైక్‌రేట్ 245.5గా ఉంది.
- 'గేమ్ ఛేంజర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును ఖమ్మం ప్లేయర్ హిమతేజ అందుకున్నాడు.
- ఖమ్మం జట్టు స్పిన్నర్ వేద్ రెడ్డి (16 ఏళ్లు) 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్నాడు.
- హైదరాబాద్ ప్లేయర్ గడుగు గణేశ్.. బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్లేయర్ అవార్డు అందుకున్నాడు.
- విజేతగా నిలిచిన ఈ–ఛాంపియన్స్‌కు రూ.కోటి ప్రైజ్‌మనీ చెక్కు, రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం జట్టుకు రూ.50 లక్షల చెక్కును గవర్నర్ శివప్రతాప్ శుక్లా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందజేశారు.
- ట్రోఫీని అందుకున్న తర్వాత హైదరాబాద్ జట్టు పెద్దఎత్తున సంబరాలు చేసుకుంది.






## రాకా సినిమా రిజెక్ట్ చేసిన ప్రీతి ముకుందన్

తాజాగా వచ్చిన 'బ్లాస్ట్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్. మానసికంగా, శారీరకంగా దృఢమైన ఆడపిల్లగా ప్రీతి నటించిన తీరుకు విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు తమిళ రొమాంటిక్ డ్రామా 'హృదయం మురళి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇదిలా ఉంటే.. ఈ యంగ్ హీరోయిన్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో వస్తున్న 'రాకా' సినిమాలో అవకాశం వస్తే రిజెక్ట్ చేసిందట. ఈ విషయాన్ని రాకా డైరెక్టర్ అట్లీ స్వయంగా తెలిపాడు. 'హృదయం మురళి' సినిమా ట్రైలర్ ఈవెంట్‌కు విచ్చేసిన అట్లీ మాట్లాడుతూ.. 'రాకాలో ఒక కీలక పాత్ర కోసం ఫస్ట్ ప్రీతి ముకుందన్‌ను సంప్రదించాము. కానీ అప్పటికే ప్రీతి వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో డేట్లు కుదరక అవకాశం వదులుకోవాల్సి వచ్చింది. అనంతరం ఆ పాత్రను నటి ఫెమినా జార్జ్‌కు ఇచ్చాము. అయితే.. ప్రీతి నటనకు నేను పెద్ద అభిమానిని. 'రాకా'తో కలిసి పని చేసే అవకాశం మిస్ అయినా.. భవిష్యత్తులో తప్పకుండా ఆమెతో ఓ సినిమా చేస్తాను' అంటూ చెప్పుకొచ్చాడు అట్లీ.

## బికినీ.. ఇంటిమేట్ సీన్స్‌పై నా అభిప్రాయం ఇదే

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొని, సినిమాల్లో నటించే విషయంలో తన వ్యక్తిగత పరిమితుల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ.. "బికినీ సన్నివేశాల్లో నటించడం నాకు ఎప్పుడూ అసౌకర్యంగానే అనిపిస్తుంది. అది నా వ్యక్తిగత విషయం అని నేను నమ్ముతాను. అందుకే అలాంటి సన్నివేశాల్లో తెరపై కనిపించేందుకు నేను ఎప్పుడూ సిద్ధంగా ఉండేదాన్ని కాదు. అలాగే ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించడం కూడా నాకు అసౌకర్యంగా అనిపిస్తుంది. ఆ విషయంలో నేను నా వ్యక్తిగత పరిమితిని గీసుకున్నాను. ఆ హద్దును ఎప్పుడూ దాటకూడదని నిర్ణయించుకున్నాను" అని చెప్పుకొచ్చింది. కాజల్ అగర్వాల్ సినీ కెరీర్ ప్రారంభమై చాలా సంవత్సరాలు అయినప్పటికీ, మితిమీరిన రొమాంటిక్ సన్నివేశాలు, స్కిన్ షో వంటి అంశాలకు దూరంగానే ఉంటూ తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగించింది. ప్రస్తుతం ఆమె పలు చిత్రాల్లో నటిస్తోంది.





## అలసట ఏమాత్రం గుర్తుకు రావడం లేదు..

యంగ్ బ్యూటీ రాశీఖన్నా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ మంచి గుర్తింపు సంపాదించుకుంటున్నారు. ప్రస్తుతం రజినీకాంత్ 'ధర్మన్' చిత్రంతో పాటు.. హిందీలో ఓ భారీ కామెడీ ఎంటర్‌టైనర్‌లో కీలక పాత్రలో కనిపించబోతోంది. టైటిల్ ఖరారు కానీ ఈ సినిమాకు సీనియర్ డైరెక్టర్ అనీస్ బాజ్మీ దర్శకత్వం వహిస్తుండగా.. ఇందులో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్, సీనియర్ నటి విద్యాబాలన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చాలా కాలం తర్వాత అక్షయ్ కుమార్, అనీస్ బాజ్మీ కాంబినేషన్ లో సినిమా వస్తుండటంతో బాలీవుడ్ లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా, ఈ మూవీకి సంబంధించిన కీలకమైన షెడ్యూల్ ముగిసింది. ఈ విషయాన్ని తెలుపుతూ రాశీ ఖన్నా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఎమోషనల్ నోట్‌ను పంచుకున్నారు. "ప్రతి షూటింగ్ షెడ్యూల్ మనకు ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుందని నేను ఎప్పుడూ నమ్ముతాను. మన చుట్టూ ఉండే మనుషుల నుంచే మనకు నిజమైన బలం వస్తుందని ఈ షెడ్యూల్ నాకు మరోసారి గుర్తుచేసింది. షూటింగ్ మధ్యలో అనారోగ్యం బారిన పడటం అనేది ఎవరికైనా చాలా కష్టమైన విషయం. ఒకానొక దశలో శారీరకంగా నన్ను నేను చాలా పుష్ చేసుకోవాల్సి వచ్చింది. కానీ అలాంటి సమయంలో నా మేనల్లుడి నుంచి వచ్చిన ఒక చిన్న హగ్, ఫ్యామిలీ మెంబర్స్ చేసిన ఫోన్ కాల్స్, అలాగే సెట్స్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చి నువ్వు బాగున్నావా? అని అడిగిన పలకరింపులు నా కష్టాన్ని దూరం చేశాయి. ఆ ప్రేమతో నా రోజంతా ఎంతో తేలికగా మారిపోయేది" అని చెప్పుకొచ్చారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD**, **PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com